క్లుప్తంగా

పొంచి ఉన్న ప్రమాదం!



కోతకు గురైన రోడ్డు

చిట్యాల: మండల కేంద్రం నుంచి టేకుమట్లకు వెళ్లే ప్రధాన దారిలో.. పెట్రోల్ పంపు సమీపంలో తారు రోడ్డు పక్కన గుంత ప్రమాదకరంగా మారింది. గతేడాది అధిక వర్షాల కారణంగా పక్కనే ఉన్న చెరువు నిండి రోడ్డు వరకు వచ్చి రోడ్డు కోతకు గురైంది. ఈ దారి వెంట వాహనదారులు ఎదురెదురుగా వస్తే పెద్ద ప్రమాదం జరిగే అవకాశం ఉంది. కావున సంబంధిత అధికారులు స్పందించి రోడ్డు పక్కన మట్టి పోయించాలని పలువురు వాహనాదారులు కోరుతున్నారు.

పొదల తొలగింపు



ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ తొలగించిన పొదలు

సాక్షి ఎఫెక్ట్..

మొగుళ్లపల్లి: మండల కేంద్రంలోని రక్తానివాడలో ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ చెట్ల పొదలు అల్లుకోని ఉన్నాయి. దీంతో 'చెట్ల పొదలను తొలగించాలి' అనే శీర్షిక 'సాక్షి'లో ఆదివారం ప్రచురితమైంది. ఈ మేరకు విద్యుత్ అధికారులు స్పందించి చెట్ల పొదలను తొలగించారు. దీంతో కాలనీవాసులు సంతోషం వ్యక్తం చేశారు.

ఆర్యవైశ్యులు అన్ని రంగాల్లో ముందుండాలి



రవీందర్‌ను సన్మానిస్తున్న ఆర్యవైశ్యులు

నర్సంపేట : ప్రజాసేవతో పాటు అన్ని రంగాల్లో ఆర్యవైశ్యులు ముందుండాలని తెలంగాణ ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర కార్యదర్శి వంగేటి అశోక్‌కుమార్ ఆకాంక్షించారు. పట్టణంలోని ఆర్యవైశ్య భవన్‌లో జిల్లా అధ్యక్షుడు దుబ్బ శ్రీనివాస్ అధ్యక్షతన ఆదివారం నిర్వహించిన ద్వితీయ కార్యవర్గ సమావేశానికి అశోక్‌కుమార్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఆర్యవైశ్య కులస్తులు సంఘటితంగా ఉంటూ రాజకీయాల్లోనూ రాణించాలని సూచించారు. పేద ఆర్యవైశ్యులకు అండగా నిలవాలని కోరారు. అనంతరం మహాసభ ప్రతినిధులు దొడ్డ రవీందర్, తదితరులను శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మహాసభ జిల్లా కార్యదర్శి గార్లపాటి నాగేంద్రబాబు, కోశాధికారి గండె శ్రీనివాస్ గుప్తా, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపై ప్రమాదకరంగా మట్టి



రోడ్డుపై ఉన్న మట్టి



మిషన్ భగీరథ పైపులైన్ లీకేజీతో నిలిచిన నీరు

- లీకైన మిషన్ భగీరథ పైపులైన్
- మరమ్మతుల కోసం తీసిన మట్టి
- నెలల తరబడి రహదారిపైనే..
- పట్టించుకోని అధికారులు

చిట్యాల: మండలంలోని జడల్‌పేట గ్రామ శివారులోని బ్రిడ్జి సమీపంలో మిషన్ భగీరథ పైపులైన్ మరమ్మతుల కోసం రెండు నెలల క్రితం మట్టిని తీశారు. కానీ సంబంధిత అధికారులు ఆ మట్టిని అలాగే వదిలేయడంతో వాహనదారులు అవస్థలు పడుతున్నారు. అధికారులకు సమాచారం అందించిన పట్టించుకోవడం లేదని వాహనదారులు, గ్రామస్తులు ఆగ్రహం చేస్తున్నారు. నెలల తరబడి రోడ్డుపై మట్టి ఉంటే ఏదైనా ప్రమాదం జరిగితే బాధ్యత ఎవరు వహిస్తారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వృథాగా పోతున్న భగీరథ నీరు..

బావుసింగ్‌పల్లి గ్రామానికి చెందిన ఓ రైతు పొలంలో మిషన్ భగీరథ పైపులైన్ లీకేజీ కావడంతో సంబంధిత అధికారులకు సమాచారం అందించారు. దీంతో సిబ్బంది జేసీబీ సాయంతో మట్టిని తీసి రోడ్డుపై పోశారు. అప్పటి నుంచి మట్టి రోడ్డుపై ఉండడంతో పలు వాహనదారులకు ప్రమాదాలు జరిగే పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి రోడ్డుపై ఉన్న మట్టిని త్వతగతిన తొలగించాలని, అలాగే లీకేజీ అయిన పైపులైన్‌కు మరమ్మతు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

అధికారులు పట్టించుకోవడం లేదు



రోడ్డుపై ఉన్న మట్టిని తొలగించాలని సంబంధిత అధికారులకు సిబ్బందికి సమాచారం అందించిన ఎవరు పట్టించుకోవడం లేదు. రెండు నెలలుగా ప్రధాన రోడ్డుపై మట్టి ఉండడం మూలంగా వాహనదారులు అవస్థలు పడుతున్నారు. కావున వెంటనే రోడ్డుపై ఉన్న మట్టిని తొలగించాలి. అలాగే మిషన్ భగీరథ పైప్‌లైన్‌కు మరమ్మతులు చేసి గ్రామానికి నీరు అందించాలి.

– రత్నాకర్‌రెడ్డి, మాజీ సర్పంచ్, జడల్‌పేట

షార్ట్ సర్క్యూట్‌తో గుడిసె దగ్ధం



దగ్ధమైన గుడిసెను చూపుతున్న బాధితుడు బాపు



మంటలు ఆర్పుతున్న ఫైరింజన్ సిబ్బంది

మల్హర్: విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో గుడిసె దగ్ధమైన ఘటన మండలంలోని పెద్దతూండ్ల గ్రామ పంచాయతీ పరిధిలోని కిషన్‌రావుపల్లిలో ఆదివారం చోటుచేసుకుంది. బాధితుడు కాగితపు బాపు తెలిపిన వివరాల ప్రకారం.. బాపు అతడికి చెందిన గుడిసెలో వృతిరీత్యా వడ్రంగి పనులు చేసుకుంటాడు. కాగా గుడిసెలో ఒక్కసారి శబ్దం వినిపించి మంటలు చేలరేగాయి. చుట్టూ పక్కల వారు మంటల ఆర్పే ప్రయతం చేసిన సాధ్యం కావడంతో ఫైరింజన్‌కు సమాచారం సిబ్బంది వచ్చి మంటలు ఆర్పారు. అప్పటికే గుడిసెలలో ఉన్న వడ్రంగి సామగ్రితో పాటు రైతులు నుంచి పనులు నిమత్తం తీసుకున్న పరిమిషన్ టేకు కర్ర పూర్తిగా దగ్ధమైంది. దీంతో రూ.15 లక్షల వరకు నష్టపోయాయని బాధిత రైతు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకున్నారు. అలాగే గుడిసె పక్కన ఉన్న ఇంట్లో ఏసీ, కిటకీ డోర్లు ఖాళీపోయాయి.

సొంతింటి కల కాంగ్రెస్‌తోనే సాకారం

- పార్టీ మండల అధ్యక్షుడు సతీశ్‌గౌడ్



ఇంటి నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న సతీశ్‌గౌడ్, లబ్ధిదారులు

టేకుమట్ల: నిరుపేదల సొంతింటి కల కేవలం కాంగ్రెస్‌తోనే సాకారమైందని ఆ పార్టీ మండల అధ్యక్షుడు కోటగిరి సతీశ్‌గౌడ్ అన్నారు. ఆదివారం మండలంలోని ఎంపేడు, కుందనపల్లి, కలికోటపల్లిలో లబ్ధిదారులకు మంజూరైన ఇంటి నిర్మాణాలకు భూమి పూజ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వం డబుల్ బెడ్రూంల ఆశ చూపి 24 గ్రామ పంచాయతీలున్న మండలంలో కేవలం ఐదు గ్రామాల్లోనే నిర్మించారని, అవి కూడా పూర్తి స్థాయిలో నిర్మించకుంటే లబ్ధిదారులే నిర్మించుకున్నారని అన్నారు. అధికారం చేపట్టిన రెండు సంవత్సరాల లోపే అన్ని గ్రామాల్లోని నిరుపేదలకు డబుల్ బెడ్రూం ఇళ్లను మంజూరు చేసిన ఘనత కేవలం కాంగ్రెస్ ప్రభుత్వానిదేనన్నారు. మళ్లీ రెండో దశలో మిగిలిన వారికి ఇళ్లు మంజూరు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పచ్చిక దిలీప్‌రెడ్డి, ఇసంపెల్లి పోశాలు, పంచాల రవి, నాగుల నరేందర్, పొనగంటి రమేష్, దేశిని మొగిళి, విష్ణు, మొండయ్య, తిరుపతి, కుమార్, క్రాంతి, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

హామీలు అమలు చేయాలి



మల్హర్: మాట్లాడుతున్న నాయకులు



కాళేశ్వరం: మహదేవపూర్‌లో..

మల్హర్: తెలంగాణ ఉద్యమకారులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేసి న్యాయం చేయాలని టీయూఎఫ్ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రం తాడిచర్లలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ మేనిఫెస్టోలో ఉద్యమకారుల సంక్షేమం కోసం పొందుపరిచిన హామీల అమలు చేసేందుకు జాప్యం చేయడం బాధాకరమన్నారు. మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల మేరకు 250 గజాల ఇంటి స్థలం, పెన్షన్లు, జార్ఖండ్ తరహాలో ఉద్యమకారుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో టీయూఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పోలోజు సత్యనారాయణ, ముడితనపల్లి ప్రభాకర్, జిల్లా అధికార ప్రతినిధి బోయిని రాజయ్య యాదవ్, మండల అధ్యక్షుడు బూడిద సతీష్, మైనార్టీ సెల్ అధ్యక్షులు షేక్ చాంద్ పాషా, సారయ్య, తోకల గట్టయ్య తదితరులు పాల్గొన్నారు.

కాళేశ్వరం: తమ సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. మహదేవపూర్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. తమను ఉద్యకారులుగా గుర్తించి, గుర్తింపుకార్డులు, ప్రతీ ఉద్యకారుడికి రూ.25వేల పెన్షన్ అందించాలన్నారు. ఉద్యమకారుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, ఉచిత బస్‌పాస్, సంక్షేమ పథకాల్లో 20 శాతం కోట వర్తింపజేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టఫ్ నాయకులు అయూబోద్దీన్, దేవేందర్, ప్రభాకర్, గట్టయ్య, రమేష్, వామన్ రావు, ఇర్షాద్, అక్రమోద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

విరాళం అందజేత



విరాళం అందజేస్తున్న దాతలు

టేకుమట్ల: మండలంలోని రాఘవరెడ్డిపేట శ్రీమావురాల ఎల్లమ్మతల్లి దేవాలయానికి కరీంనగర్ జిల్లా హుజురాబాద్ మండలంలోని చెల్పూర్ గ్రామానికి చెందిన కాల్వ మధునయ్య-గంగమ్మ, కాల్వ అంజయ్య-లక్ష్మీల వారసులు కృష్ణతేజ, విష్ణుతేజ ఆదివారం మావురాల ఎల్లమ్మతల్లి ఆలయంలో ఆలయ కమిటీ సభ్యులకు రూ.1లక్షా 16లను విరాళంగా అందించారు. ఆలయ అభివృద్ధికి విరాళం అందించిన దాతలకు ఆలయ కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ వంగ ప్రభాకర్, తుమ్మేటి సురేందర్‌రెడ్డి, వంగ కుమారస్వామి, సోమ రమేష్, గొల్లపెల్లి సారయ్య, గొల్లపెల్లి రఘుపతి, రవి, పల్లెవేన సమ్మయ్య, రమేశ్, సంపత్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

కూలిన రేకుల షెడ్డు

కన్నాయిగూడెం: దురురు గాలులతో కురిసిన వర్షానికి శనివారం రాత్రి మండల పరిధి తుపాకుగూడెంలోని గిరిజన వసతి గృహంలో రేకుల వంట షెడ్డు కూలిపోయింది. కొన్ని సంవత్సరాల నుంచి శిథిలావస్థలో ఉండడంతో గాలి తీవ్రంగా రావడంతో రేకులు లేసి పడిపోయాయి. ఈ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది.

నేడు ఉపాధిహామీ ప్రజావేదిక

కాళేశ్వరం: మహదేవపూర్ మండలంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకములో 15వ విడత సామాజిక తనిఖీ నివేదికపై ప్రజావేదిక సోమవారం(నేడు) ఉదయం 10గంటలకులకు మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ వెంకటేశ్వర్లు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పంచాయతీ కార్యదర్శులు, గ్రామ పంచాయతీల ఫీల్డ్ అసిస్టెంట్లు, ఈజీఎస్ సిబ్బంది సకాలంలో హాజరుకావాలని కోరారు.

పరామర్శ



పరామర్శిస్తున్న గండ్ర వెంకటరమణారెడ్డి

శాయంపేట : మండలంలోని మైలారం గ్రామ మాజీ సర్పంచ్ అరికిల్ల ప్రసాద్ సోదరుడు ఆర్మీ జవాన్ ప్రవీణ్ ఇటీవల మృతిచెందాడు. విషయం తెలుసుకున్న భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి ఆదివారం ప్రవీణ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం కొప్పుల గ్రామానికి చెందిన సామల రమేశ్‌బాబు ప్రథమ వర్ధంతిలో పాల్గొని నివాళులర్పించారు. ఆయన వెంట మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు ఉన్నారు.

అభివృద్ధి పథంలో భారత్



పార్టీలో చేరిన వారితో నాయకులు

వెంకటాపురం(కె): బీజేపీని బూత్ స్థాయి నుంచి బలోపేతం చేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షుడు, స్టేట్ కౌన్సిల్ మెంబర్ కుంజ ధర్మ అన్నారు. వెంకటాపురం(కె) మండల పరిధిలోని సుడిబాకలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. ప్రధానమంత్రి మోదీ ఆధ్వర్యంలో భారతదేశం అభివృద్ధి పథంలో ముందుకు సాగుతుందన్నారు. ఈ సందర్భంగా పలు పార్టీల నుంచి 40 మంది కుటుంబాల వారు మండల అధ్యక్షుడు రామెళ్ల రాజశేఖర్ ఆధ్వర్యంలో పార్టీలో చేరగా వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో పసుమరి సతీష్, ఉప్పల కృష్ణ మూర్తి, హేమ సుందర్, రమేష్, సతీష్, శ్రీను, గణేష్, సురేష్, రవీందర్, ప్రశాంత్, నాగేంద్ర బాబు, సాంబశివరావు ఉన్నారు.

బోరు మోటారు అందజేత



బోరు మోటారు వద్ద నాయకులు

కాటారం: మండల కేంద్రంలోని అంగడి బజార్‌లో బోరుబావి మోటారు చెడిపోయి తీవ్ర నీటి ఎద్దడి నెలకొంది. కాలనీవాసులు కొన్ని రోజులుగా నీటికి ఇబ్బందులు పడుతున్నారు. సమీపంలో చేతిబోరు, వ్యవసాయ బోర్లు లేక పక్క కాలనీ నుంచి నీరు తెచ్చుకోవడానికి తంటాలు పడుతున్నారు. కాలనీవాసులు వారి ఇబ్బందులు మాజీ ఎంపీటీసీ తోట జనార్దన్ దృష్టికి తీసుకురావడంతో ఆదివారం బోరుబావికి సొంత ఖర్చులతో నూతన మోటారు ఏర్పాటు చేయించారు. నీటి ఇబ్బంది తొలిగిపోవడంతో కాలనీవాసులు జనార్దన్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం



రమేశ్ కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న జయరాంరెడ్డి

మంగపేట: మండలంలో ఇటీవల మృతి చెందిన బాధిత కుటుంబాలను మంత్రి సీతక్క, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు అశోక్ ఆదేశాల మేరకు ఆ పార్టీ మండల అధ్యక్షుడు మైల జయరాంరెడ్డి, నాయకులు ఆదివారం పరామర్శించి బియ్యం, నగదును అందజేశారు. మండల కేంద్రంలోని పొదుమూరులో మృతి చెందిన బద్ది పాపారావు కుటుంబానికి రూ.6,000 నగదు, తిమ్మంపేట గ్రామానికి చెందిన చినపెల్లి రమేశ్ కుటుంబానికి క్వింటా బియ్యం, 15 లీటర్ల నూనె, రూ.10,000 నగదు, చితల జక్కులు కుటుంబానికి రూ.3,000, బోడసమ్మయ్య కుటుంబానికి రూ.3,000 నగదును ఆర్థిక సాయంగా అందజేశారు. అదే గ్రామానికి చెందిన అజ్మీర ఖాజాకు రూ.5.75 లక్షల విలువ గల సీఎంఆర్ఎఫ్ చెక్కును అందజేశారు. కార్యక్రమంలో ఆపార్టీ జిల్లా, మండల నాయకులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

రేగొండ: మండలంలోని మడ్తపల్లిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుకున్న 2003–04 సంవత్సరం పదో తరగతి బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు ఆదివారం పాఠశాల ఆవరణలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నా రు. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. పాఠాలు చెప్పిన గురువులను ఘనంగా సన్మానించా రు. ఉపాధ్యాయులు నాగేంద్రస్వామి, భద్రయ్య, హరి, సుధీర్, వేనుమాధవ చారి, భాస్కర్, కృష్ణ, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

వన్య ప్రాణులను వేటాడడం నేరం

శాయంపేట : వన్య ప్రాణులను వేటాడడం నేరమని ఓరుగల్లు వైల్డ్ లైఫ్ సొసైటీ హనుమకొండ జిల్లా సభ్యుడు సునీల్ అన్నారు. ప్రగతిసింగారం గ్రామంలో చలివాగు బ్రిడ్జి పరిసర ప్రాంతంలో ఆదివారం ఇద్దరు వేటగాళ్లు పక్షులను వేటాడేందుకు ప్రయత్నిస్తుండగా వన్యప్రాణి ప్రేమికుడు విజేందర్‌తో కలిసి ఆయన అడ్డుకున్నాడు. అటవీశాఖ ఉన్నతాధికారులకు సమాచారం అందించగా వేటగాళ్ల నుంచి వేట సామగ్రిని స్వాధీనం చేసుకుని విచారించగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పల్నాడు జిల్లా అచ్చంపేట మండలం చెరుకుపాలెం గ్రామాని చెందిన సానికొమ్ము బాబు, సానికొమ్ము రామాంజి గ్రామాల్లో సంచరిస్తూ పందులను విక్రయిస్తున్నట్లు తెలిపారు. అనంతరం వేటగాళ్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు.

పల్లెల్లో 'గిరిగిరి' మాఫియా!

- అనుమతులు లేకుండానే దందా..
- ఆస్తుల డాక్యుమెంట్లు తనఖా..
- అధిక వడ్డీతో పేదలను దోచుకుంటున్న వ్యాపారులు



గోవిందరావుపేట : గిరి గిరి ఫైనాన్స్... ఈ పేరు వింటేనే ప్రజలు బెంబేలెత్తుతున్నారు. ప్రజల అవసరాన్ని ఆసరాగా చేసుకుంటున్న కొందరు అధిక వడ్డీకి అప్పు ఇస్తూ.. మానసికంగా ఇబ్బందులకు గురి చేస్తున్నారు. మండల కేంద్రంతో పాటు పల్లెలు, తండాల్లో సైతం గిరిగిరి మాఫియాగా మారిందనే చెప్పొచ్చు. గిరిగిరి దందాకు అనుమతులు సంగతి అటుంచితే... అదుపులేని వడ్డీతో అక్రమ వ్యాపారం సాగిస్తున్నారు. వీరి బారిన పడుతున్న పేదల ఇళ్లు, భూములు గుల్ల చేసుకుంటున్నారు అనడంలో ఎటువంటి అతిశయోక్తి లేదు. మండలంలో సుమారు 30 మంది వరకు, 10 మంది ఆంధ్ర వారు గిరి గిరి దందా నిర్వహిస్తున్నట్లు సమాచారం. అక్రమ వ్యాపారాన్ని నియంత్రించాల్సిన అధికారులు వ్యాపారుల దందాకు చెక్ పెట్టకపోవడం వెనక పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇలా గిరి గిరి పేరుతో 10 వేలు ఇస్తే ముందుగానే 1200 కట్ చేసుకొని 8,800 సదరు వ్యక్తికి ఇస్తున్నారు. ప్రతి రోజు రోజుకు 100 నుంచి 200 వరకు 100 రోజుల్లో ముక్కుపిండి మరి వసూలు చేస్తున్నట్లు తెలుస్తోంది. కొందరు వ్యక్తులు కోట్లల్లో గిరిగిరి ఫైనాన్స్ దందా కొనసాగిస్తూ వారం రోజులకోసారి ఇంటింటికి తిరిగి డబ్బులు వసూలు చేస్తున్నారు. ప్రధానంగా మండలంలో కోట్లల్లో గిరి గిరి దందా నిర్వహిస్తున్నట్లు సమాచారం. సదరు గిరి గిరి రాయుళ్ల కనీసం రూ.లక్ష నుంచి రూ.10 లక్షల వరకు ఫైనాన్స్ ఇస్తున్నట్లు తెలుస్తుంది.

పేదలు, ఆటోడ్రైవర్లు, చిరు వ్యాపారులే లక్ష్యం

పేదలు, ఆటో డ్రైవర్లు, చిరు వ్యాపారులే లక్ష్యంగా ఈ దందా కొనసాగుతోంది. అప్పు ఇవ్వడానికి పట్టాపాస్ పుస్తకం, బంగారం, వాహనాలను, స్థిరాస్తి డాక్యుమెంట్లు, ఖాళీ చెక్కులను, ఏటీఎం కార్డులను తనఖా పెట్టుకొని డబ్బులు ఇస్తున్నారు. అప్పు తీర్చని యెడల వాటిని జప్తు చేస్తున్నారు. ఏటీఎం ద్వారా వారే డబ్బులు డ్రా చేసుకుంటున్నారు.

అనుమతులు లేకుండానే...

అనుమతులు లేకుండానే గిరిగిరి ఫైనాన్స్ దందా ఎలా కొనసాగిస్తున్నారనేది అర్థం కానీ పరిస్థితి. అసలు ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా ఈ దందా కొనసాగుతోంది. గ్రామీణ ప్రాంతాల్లో చిన్న చితక వ్యాపారస్తులకు గిరిగిరి ఫైనాన్స్ నిర్వాహకులే పెట్టుబడులు పెట్టి, అధిక వడ్డీలు వసూలు చేస్తున్నారు. అధిక వడ్డీలకు అప్పులు ఇచ్చి వేధింపులకు గురిచేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించి దాడులు నిర్వహించినా మళ్లీ వడ్డీ వ్యాపారాన్ని యథేచ్ఛగా కొనసాగిస్తున్నారు.

ఆంధ్ర దాదా గిరి

ఆంధ్ర నుంచి కొంత మంది మండలానికి వచ్చి గిరి గిరి వ్యాపారాన్ని యథేచ్ఛగా కొనసాగిస్తున్నారు. ఆధార్, పాన్ కార్డు, బ్యాంక్ పాస్‌బుక్ జిరాక్స్‌లతో డబ్బులు ఇస్తూ వారానికోసారి ఒక లోకల్ క్యాండెట్‌ని పెట్టుకొని వసూలు చేస్తున్నారు. మంగళ, శని వారాల్లో ఆంధ్ర వారు సుమారు పది మందికి పైగా మండలంలో దందాను కొనసాగిస్తున్నారు. వారాం తప్పు చెల్లించని పక్షంలో బాధితుల ఇంటి ఎదుట నానా హైరానా చేస్తున్నట్లు సమాచారం.

చర్యలు తీసుకుంటాం..

అనుమతులు లేకుండా ప్రైవేట్, మైక్రో ఫైనాన్స్‌ల పేరిట గిరిగిరి దందాలు చేస్తూ అధిక వడ్డీలకు ప్రజలకు రుణాలు ఇచ్చి ఇబ్బందులు పెడితే చట్టరీత్యా చర్యలు తీసుకుంటాం. అధిక వడ్డీలు వసూలు చేస్తే కేసులు నమోదు చేస్తాం. ప్రైవేట్ ఫైనాన్స్, గిరిగిరి నిర్వాహకులు ప్రజలను ఇబ్బంది పెడుతున్నట్లు ఫిర్యాదు అందితే కఠిన చర్యలు తీసుకుంటాం.

– జి రవీందర్, సీఐ, పస్రా

ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డిపై పోలీసులకు ఫిర్యాదు

మంగపేట: సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి సీతక్కపై హుజురాబాద్ ఎమ్మెల్యే పాడికౌశిక్‌రెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేశారని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మైల జయరాంరెడ్డి ఆధ్వర్యంలో ఆపార్టీ నాయకులు ట్రైనీ ఎస్సై శ్రీకాంత్‌కు ఆదివారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. మంత్రి సీతక్క, సీఎం రేవంత్‌రెడ్డిపై శంషాబాద్ ఎయిర్‌పోర్టులో క్వారీ యజమానిని బెదిరించిన కేసులో అరెస్టయిన ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి అసత్య ప్రచారం చేస్తూ ఇష్టం వచ్చినట్లు మాట్లాడారని తెలిపారు. క్వారీని అక్రమంగా నడిపిస్తున్నారని, జిల్లాలో మంత్రి సీతక్క కాంట్రాక్టర్ల దగ్గర నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారని ఎలాంటి ఆధారాలు లేకుండా ఆరోపణలు చేసిన కౌశిక్‌రెడ్డిపై కేసు నమోదు చేయాలని కోరారు. నిరాధారమైన ఆరోపణలు చేసిన ఆయనపై వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా, మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.